# రైల్‌రోకో కేసు కొట్టేయండి

- ఆధారాలు లేకుండానే బనాయించారు
- బీఆర్ఎస్ అభినేత కేసీఆర్ పిటిషన్
- నేడు విచారణ జరుపనున్న హైకోర్టు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై నమోదైన రైల్‌రోకో కేసును కొట్టివేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా 2011 అక్టోబర్ 15, 16, 17న రైల్‌రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చామన్న అభియోగంతో ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు నమోదైందని, ఎలాంటి ఆధారాలు లేకుండానే తనను నిందితుల జాబితాలో చేర్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి తాను రైల్‌రోకో కార్యక్రమానికి పిలుపు ఇవ్వలేదని, కొందరు మౌఖికంగా ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు తనపై తప్పుడు కేసు బనాయించారని తెలిపారు. అప్పట్లో మౌలాలిలో రైల్‌రోకో కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యమకారులందరినీ షరతులతో కోర్టు విడిచిపెట్టిందని, ఈ కేసు నమోదైన మూడేండ్లకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని కేసీఆర్ గుర్తుచేస్తూ.. తనపై నమోదైన తప్పుడు కేసును కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరుపనున్నది.

రాజ శ్రీనివాస్‌నగర్ కాలనీలో నాలా శిథిలాలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్

# ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- బాక్స్‌డ్రైనేజీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలి
- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆందోళన

నేరేడ్‌మెట్, జూన్ 24 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గౌతంనగర్ డివిజన్ రాజ శ్రీనివాస్‌నగర్ కాలనీ, వెంకటాద్రినగర్‌లో ఏడాదైనా పూర్తికాని బాక్స్‌డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఆందోళన చేపట్టారు. మిర్జాలగూడ, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజా శ్రీనివాస్‌నగర్, పవన్‌మోటర్ ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా ఉండేందుకు పనులు తక్షణమే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ డీఈ లౌక్య ఎమ్మెల్యేతో మాట్లాడి బాక్స్‌డ్రైనేజీ పనులకు విద్యుత్తు స్థంభాలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించగానే రెండు మూడు రోజుల్లో పనులు చేపడతామని హామీ నిచ్చారు. దీంతో ఎమ్మెల్యే మర్రి, కార్పొరేటర్ మేకల సునీత ఆందోళన విరమించారు.

# ఫస్టియర్‌లో 63, సెకండియర్‌లో 43శాతం పాస్

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను సోమవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇంటర్‌బోర్డు కార్యదర్శి శృతిఓజా విడుదల చేశారు. ఫస్టియర్‌లో 63.86 శాతం, సెకండియర్‌లో 43.77శాతం ఉత్తీర్ణత నమోదైంది. రెండింటిలోనూ అమ్మాయిలే సత్తా చాటారు. కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 29లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చు.

# డీఎస్సీ పూర్తి షెడ్యూల్ ప్రకటించరూ..!

- పేపర్లవారీగా పరీక్షలెప్పుడో వెల్లడించని సర్కారు
- జూలై 17 నుంచి డీఎస్సీ పరీక్షలు
- టెన్షన్‌లో అభ్యర్థులు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): మెగా డీఎస్సీ అంటూ హడావిడి చేసిన రాష్ట్రప్రభుత్వం పరీక్షల నిర్వహణలో స్పష్టత ఇవ్వడంలేదు. పేపర్లవారీగా పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించలేదు. దీంతో డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టెన్షన్ పట్టుకుంది. ఎప్పుడు ఏ పరీక్షను నిర్వహిస్తారో.. ఏ పేపర్‌కు ఎంత సమయం పాటు ప్రిపర్‌కావాలనో తెలియక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. జూలై 17 నుంచి 31 వరకు డీఎస్సీ రాత పరీక్షలను నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించింది. తొలిసారిగా డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించనుండగా, ఉమ్మడి పది జిల్లాల్లోనే సెంటర్లను కేటాయించనున్నారు. పలువురు అభ్యర్థులు సెకండరీ గ్రేడ్ టీచర్‌తో పాటు, పలు సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేస్తే ప్రిపేర్‌కావడానికి వెలుసుబాటుగా ఉంటుందని అభ్యర్థులు అంటున్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి డీఎస్సీ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేయాలని తెలంగాణ డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

**పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ**

డీఎస్సీకి ఈ ఏడాది 2,79,956 మంది దరఖాస్తు చేసుకున్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తక్కువగా ఉండగా, ఈ పోస్టుకే అత్యధికంగా దరఖాస్తు చేసుకోవడంతో పోటీ ఎక్కువైంది. 2వేలకు పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,61,746 మంది దరఖాస్తు చేసుకోగా, 6వేలకు పైగా గల ఎస్జీటీ పోస్టులకు 88,007వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. లాంగ్వేజ్ పండిట్‌కు 18,211, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌కు 11,992 మంది అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. కాగా 11,062 టీచర్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ డీఎస్సీ -2024 నోటిఫికేషన్‌ను జనవరిలో విడుదల చేసింది. వీటిలో 2,629 స్కూల్ అసిస్టెంట్, 6,508 సెకండరీ గ్రేడ్ టీచర్లు, 727 భాషాపండితులు, 182 పీఈటీ పోస్టులున్నాయి. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 220 ఉండగా, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు 796 ఉన్నాయి.

**సబ్జెక్టులవారీగా దరఖాస్తులు**
(తెలుగు మీడియం-పోస్టులు)

| దరఖాస్తులు | |
|---|---|
| 14,069 | తెలుగు లాంగ్వేజ్‌పండిట్ |
| 10,921 | ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ |
| 34,233 | జీవశాస్త్రం స్కూల్ అసిస్టెంట్ |
| 16,875 | తెలుగు స్కూల్ అసిస్టెంట్ |
| 28,701 | గణితం స్కూల్ అసిస్టెంట్ |
| 42,094 | సోషల్ స్కూల్ అసిస్టెంట్ |

సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద డీఎస్సీ అభ్యర్థుల ఆందోళనలు

## 'హెచ్‌డబ్ల్యూవో'లో సాంకేతిక సమస్యలు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్(హెచ్‌డబ్ల్యూవో) పోస్టుల భర్తీ ఆన్‌లైన్ పరీక్షల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఒక సెంటర్‌లో పరీక్ష నిలిచిపోగా, మరో సెంటర్‌లో గంటకు పైగా ఆలస్యమైంది. సైదాబాద్‌లోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కాలేజీ సెంటర్‌లో సాంకేతిక సమస్య తలెత్తగా, ఉదయం సెషన్‌లో అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు.

## తెలంగాణ ఉద్యమకారుడు భూపాల్‌రెడ్డిమృతి

ఎల్బీనగర్, జూన్ 24 : తెలంగాణ ఉద్యమకారుడు జనగాం భూపాల్‌రెడ్డి ఎల్బీనగర్‌లో మరణించగా అంత్యక్రియలు నాగోలులో సోమవారం నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న భూపాల్‌రెడ్డి ఎల్‌ఐసీ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఉద్యమ నాయకుడు కేవీ రంగారెడ్డి నివాళులర్పించారు.

## 'కోర్'లో సీట్లకు కోత

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కోర్ బ్రాంచిల్లో ఈ ఏడాది మరో 9వేల సీట్లకు కోతపడనుంది. నిరుడు 5వేలకు పైగా సీట్లకు కోతపడగా, ఈ ఏడాది ఏకంగా 9వేల సీట్లు తగ్గనున్నాయి. ఈ సీట్లను కంప్యూటర్ సైన్స్ కోర్సు(సీఎస్ఈ) సీట్లుగా కన్వర్షన్ చేయబోతున్నారు. ఇవన్నీ సివిల్, మెకానికల్, ఈసీఈ, ఈఈఈ కోర్సులకు సంబంధించిన సీట్లే కావడం గమనార్హం. ఇందుకు ప్రభుత్వం ఆమోదిస్తే ఈ ఏడాది సీఎస్ఈ కోర్సులో 9వేలకు పైగా సీట్లు పెరగనున్నాయి. అప్పిలేట్ కమిటీ 138 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు అనుబంధ గుర్తింపునిచ్చేందుకు పచ్చజెండా ఊపింది. నిరుడు 139 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలుండగా మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని మల్లారెడ్డి విద్యాసంస్థకు చెందిన ఒక కాలేజీని అదే విద్యాసంస్థకు చెందిన మరో కాలేజీలో విలీనంచేశారు. నిరుడు బాచుపల్లి సమీపంలోని డీఆర్‌కే కాలేజీని అదే విద్యాసంస్థకు చెందిన కాలేజీలో విలీనం చేశారు. ఒక కాలేజీలో ఐటీ కోర్సులో 120 సీట్లుంటే 60సీట్లకు తగ్గించుకుని, మిగిలిన 60 సీట్లను కంప్యూటర్‌సైన్స్‌లో పెంచేందుకు ప్రతిపాదనలు సమర్పించారు. మరో కాలేజీలో ఎలక్ట్రికల్ బ్రాంచిలో 60 సీట్లుండగా, 30 సీట్లకు తగ్గించుకుని 30 సీట్లను కంప్యూటర్ సైన్స్ కోర్సుగా కన్వర్షన్ చేస్తున్నారు.

## రంగు నీళ్లలో వేస్తే డబ్బులు డబుల్!

- 33 లక్షలతో రాత్రికి రాత్రి బిహార్ ముఠాపరార్

నీలగిరి, జూన్ 24 : బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తమ దగ్గర మహిమగల రంగు నీళ్లు ఉన్నాయని, అందులో రాత్రి డబ్బులు వేస్తే తెల్లారే సరికి డబుల్ అవుతాయని చెప్పి నల్లగొండ మండలం చందనపల్లికి చెందిన ఒకరికి ద్వారా అదే గ్రామానికి చెందిన అతడి బావను నమ్మించారు. దాంతో ఆయన శనివారం రూ.33 లక్షలను అప్పు చేసి తెచ్చి ఈ ముఠాకు అప్పజెప్పాడు. వాళ్లు ఆ డబ్బులను రంగు నీళ్ల బిందెల్లో పెట్టి ఉంచారు. ఆదివారం ఉదయం వరకు రెట్టింపవుతాయని చెప్పారు. తాము ఇక్కడే ఉంటామని, ఆ బిందెలను ముట్టుకోవద్దని చెప్పి అర్ధరాత్రి రూ.33 లక్షలతో ఉడాయించా రు. ఆదివారం ఉదయం ఆ బిందెలను చూడగా.. ఖాళీగా ఉండడంతో బాధితుడు నల్లగొండ రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు టెక్నాలజీ సాయంతో ముగ్గురి సభ్యుల ముఠాలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, రూ.20 లక్షల వరకు వరకు స్వాధీనం చేసుకున్నారు.

## ఫోన్ల ట్యాపింగ్ కేసులో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు

- విచారణ నేటికి వాయిదా

నాంపల్లి కోర్టులు, జూన్ 24 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న అదనపు డీఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న నాంపల్లి కోర్టులో డిఫాల్ట్ (తప్పనిసరి) బెయిల్ పిటిషన్లను దాఖలు చేశారు. దీంతో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులు జారీ చేయాలని మేజిస్ట్రేట్ సూచించారు. దీనిపై పిటిషనర్ల తరపు న్యాయవాది స్పందిస్తూ.. పీపీ కి నోటీసులు జారీ చేయాల్సిన అవసరం లేదని, శుక్రవారం నాటితో నిందితులిద్దరి కస్టడీ 90 రోజులు పూర్తయినందున డిఫాల్ట్‌గా బెయిల్‌ను మంజూరు చేసే అధికారం కోర్టుకు ఉన్నదని వివరించారు. దీంతో భుజంగరావు, తిరుపతన్న డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లపై పీపీకి నోటీసులు జారీ చేయాలని ఆదేశించిన జడ్జి.. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు.

## ఏపీలో 1నుంచి 4 వేల పింఛన్

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): ఎన్నికల హామీ మేరకు ఏపీలో జూలై ఒకటి నుంచి రూ.4 వేల పింఛన్ అందించనున్నారు. సోమవారం అమరావతిలో చంద్రబాబు అధ్యక్షతన మంత్రి వర్గం సమావేశంలో ఆమోదించారు.

## డీఎస్సీలో మరో 15వేల పోస్టులు పెంచండి

- డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): టీచర్ల పదోన్నతులతో మరో 15వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీ అయ్యాయని, ఇప్పటికే ప్రకటించిన మెగా డీఎస్సీ ద్వారా వాటిని భర్తీచేయాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహించారు. గ్రంథాలయాలు, స్టడీహాళ్ల ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 25వేలతో మెగా డీఎస్సీ వేస్తామన్న రేవంత్ ప్రభుత్వం కేవలం 11వేల పోస్టులకే పరిమితం చేసిందని వాపోయారు. టీచర్లకు కల్పించిన పదోన్నతులతో 15వేల పోస్టులు ఖాళీఅయ్యాయని, వాటిని ఇదే డీఎస్సీలో చేర్చి భర్తీచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## స్కూల్ అసిస్టెంట్ల బదిలీ

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): మల్టీజోన్ -2లోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు మినహా 12 జిల్లాల్లో 6,013 మంది స్కూల్ అసిస్టెంట్లను సోమవారం విద్యాశాఖ అధికారులు బదిలీచేశారు. సంగారెడ్డి 834, జనగాం 335, యాద్రాది 562, మేడ్చల్ 456, వికారాబాద్ 641, మహబూబ్‌నగర్ 397, జోగులాంబ గద్వాల 305, వనపర్తి 310, నాగర్‌కర్నూల్ 451, నల్గొండ 876, సూర్యాపేట 575, నారాయణపేట జిల్లాలో 271 స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

## ప్రజావాణిలో ఫ్రీ భోజనం

పెద్దపల్లి, జూన్24: ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజల కోసం ప్రతి సోమవారం ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించాలని పెద్దపల్లి లయన్స్ క్లబ్ నిర్ణయించింది. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఆవరణలో మొబైల్ క్యాంటీన్‌ను ఏర్పాటు చేయగా, కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి ప్రారంభించారు.

## డీఎంఈకి 406 కోట్లు

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగానికి ప్రభుత్వం రూ.406.75 కోట్లు విడుదల చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

# గత ప్రభుత్వ విధానాలే..

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీ
- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 24(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలను యథావిధిగా కొనసాగిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఎంఎస్ఎంఈ-సమ్మిళిత అభివృద్ధి' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...'ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్, కానీ అభివృద్ధి ఆగకూడదు.. పారిశ్రామికాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగా గత సర్కారు ప్రవేశపెట్టిన వివిధ పాలసీలను కొనసాగిస్తాం'అని పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంఎస్ఎంఈ పాలసీని ప్రవేశపెట్టనున్నట్లు, దీంతో దేశంలోనే మొదటి ఎంఎస్ఎంఈ పాలసీ తెచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ రూపకల్పన జరుగుతున్నదని, దీనిపై సూచనలు, సలహాలు ఇవ్వాలని పరిశ్రమ వర్గాలను కోరారు. పరిశ్రమకు నైపుణ్యంగల ఉద్యోగుల అవసరం ఎంతో ఉందని, ఇందుకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# మూడు నెలల్లో నైనీలో బొగ్గు ఉత్పత్తి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం వెల్లడి

హైదరాబాద్, జూన్ 24 (నమస్తే తెలంగాణ) : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి ఈ సెప్టెంబర్ చివరికల్లా బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించాలని సింగరేణి సంస్థ లక్ష్యంగా పెట్టుకున్నది. నైనీకి 50 కిలోమీటర్ల దూరంలోనే 1,600 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాన్ని కూడా సంస్థ నిర్మించనున్నది. ఈ థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలంతోపాటు కీలకమైన భూసేకరణ సమస్యను పరిష్కరించేందుకు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం సోమవారం ఒడిశాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్‌జెనాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైనీ కోల్‌బ్లాక్‌కు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, రెండో దశ అటవీ అనుమతుల కోసం నిబంధనలను పాటిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రూ.180 కోట్లు చెల్లించామని, వన్యప్రాణి నిర్వహణ ప్రణాళికలో భాగంగా మరో రూ. 39 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం కోసం 783 హెక్టార్ల అటవీభూమిని తమకు బదలాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తికి అన్ని రకాలుగా సహకరిస్తామని ఒడిశా సీఎస్ హామీనిచ్చారు.

# 4,800 కోట్ల నుంచి సున్నాకు

**బైజూస్‌లో పెట్టుబడులను రైటాఫ్ చేసిన ప్రోసస్**

న్యూఢిల్లీ, జూన్ 24: డచ్‌కి చెందిన పెట్టుబడుల సంస్థ ప్రోసస్ నిండా మునిగింది. బైజూస్‌లో పెట్టిన 578 మిలియన్ డాలర్ల(రూ.4,800 కోట్ల) పెట్టుబడులను రైటాఫ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఎడ్యుటెక్ సంస్థ బైజూస్‌లో గతంలో 9.6 శాతం వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఈ వాటాను సాంకేతికంగా రద్దు చేసుకుంటున్నట్లు తెలిపింది. దీంతో సంస్థకు రూ.4,800 కోట్ల భారీ నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని నెదర్లాండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది. బైజూస్‌లో ఈక్విటీ ఇన్వెస్టర్ల వాటాల విలువ భారీగా క్షీణించిన నేపథ్యంలో రైటాఫ్ నిర్ణయం తీసుకున్నామని ప్రోసస్ వెల్లడించింది. దీంతో 2024 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 493 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. రైట్స్ ఇష్యూకి ముందు బైజూస్‌లో 9.6 శాతం వాటా ఉందని పేర్కొంది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు, అప్పులు, భవిష్యత్తు అంచనాలకు తమవద్ద ఎలాంటి సమాచారం లేకపోవడంతో బైజూస్ కంపెనీ విలువను సున్నాకు తగ్గిస్తున్నట్లు ప్రోసస్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

వాణిజ్య

# కిర్రాక్ ఐపీవో షో

**జనవరి మొదలు పబ్లిక్ ఇష్యూకు 37 సంస్థలు • 32,000 కోట్ల సమీకరణ • 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ రికార్డు**

ముంబై, జూన్ 24: ఈ ఏడాది సెకండరీ మార్కెటే కాదు.. ప్రైమరీ మార్కెట్ కూడా దుమ్మురేపింది. బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీలు సరికొత్త స్థాయిల్లో కదలాడుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లలోకి రికార్డు స్థాయిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్లు (ఐపీవో) వచ్చేస్తున్నాయి. ఎంతలా అంటే గడిచిన 17 ఏండ్లలో ఇదే అత్యుత్తమ ప్రథమార్ధం (జనవరి-జూన్)గా నిలిచింది. ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా 37 సంస్థలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఇందులో కో-వర్కింగ్ స్పేస్, ఫర్నీచర్ రిటైలింగ్, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ వంటి కంపెనీలూ ఉండటం విశేషం. ఇవన్నీ కలిసి దాదాపు రూ.32,000 కోట్ల నిధులను సమీకరించడం గమనార్హం. ఈ వారంలోనే మూడు ఐపీవోలు ముగిశాయి.

**2007 తర్వాత..**

2007 ప్రథమార్ధంలో గరిష్ఠంగా 54 సంస్థలు దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఐపీవోల ద్వారా ప్రవేశించాయి. నాడు అవి సమీకరించిన నిధులు రూ.20,833 కోట్లు. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయిలో కంపెనీలు ఈక్విటీ మార్కెట్లలోకి వచ్చాయి. అయితే 2022 జనవరి-జూన్‌లో 16 సంస్థలే వచ్చినా రూ.40,311 కోట్ల నిధుల సమీకరణ జరిగింది. ప్రభుత్వ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ ఐపీవో కలిసొచ్చింది. ఈ ఒక్క పబ్లిక్ ఇష్యూ విలువే రూ.21,000 కోట్లు. ఇది గనుక లేకపోతే ఐపీవో మార్కెట్‌లో 6 నెలల్లో సమీకరించిన నిధులపరంగా ఈ ఏడాదే అత్యుత్తమం. ఇక గత ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ఈ ఏడాది ఫండింగ్ నాలుగు రెట్లు ఎగిసింది. దేశ, విదేశీ మదుపరుల మద్దతే ఇందుకు కారణం. స్టాక్ మార్కెట్ల రికార్డు లాభాలూ కారణమే. ఈ లాభాలకు ఆకర్షితులయ్యే మరిన్ని సంస్థలు ఐపీవోలకు సిద్ధమైనట్టు మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. పైగా గతంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగిన ఏడాది ప్రథమార్ధంలోనూ ఈసారి నమోదైన దాంట్లో నాల్గో వంతు కూడా పబ్లిక్ ఇష్యూలు, నిధుల సమీకరణ జరుగలేదు.

**క్యూలో మరికొన్ని..**

హ్యుందాయ్ ఇండియా, స్విగ్గీ, ఓలా తదితర ప్రముఖ సంస్థలన్నీ ఐపీవోలకు క్యూ కట్టాయి. ఇందులో హ్యుందాయ్ పబ్లిక్ ఇష్యూ దేశ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్దది కానుండటం గమనార్హం. ప్రస్తుతం ఎల్ ఐసీ పేరిట ఉన్న భారీ ఐపీవో రికార్డూ చెరిగిపోనున్నది. అయితే వచ్చే నెల రాబోయే కేంద్ర బడ్జెట్.. ఐపీవోల దూకుడుకు కాస్త బ్రేకులు వేయవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటిదాకా సెన్సెక్స్ 6.8 శాతం, నిఫ్టీ 8.1 శాతం పుంజుకున్నాయి. ఇక 20 శాతానికిపైగా నిఫ్టీ మిడ్‌క్యాప్ 100, 20.5 శాతం మేర స్మాల్‌క్యాప్ 100 పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో కొత్తగా లిస్టింగైన కంపెనీలూ.. మదుపరులకు ఆకర్షణీయ రాబడులనే అందిస్తున్నాయి. బీఎస్ఈ ఐపీవో సూచీ ఈ ఏడాది 21.8 శాతం ఎగబాకింది. నిధుల సమీకరణలో ఆర్థిక రంగ సంస్థలదే నాల్గో వంతు (రూ.7,879 కోట్లు) వాటాగా ఉన్నది.

> దేశీయ సంస్థలు, కుటుంబ వ్యాపారస్తులు, అపర కుబేరుల (హెచ్ఎన్ఐ) వద్ద కావాల్సినంత నగదు నిల్వలున్నాయి. దీంతో పబ్లిక్ ఇష్యూలకు విశేష ఆదరణ లభిస్తున్నది. దీన్నిచూసి మరిన్ని సంస్థలు ఐపీవోలకు క్యూ కడుతున్నాయి. ఈ ఏడాది ఇలాగే సాగితే సరికొత్త రికార్డులు ఖాయం.
>
> - చిరాగ్ నేగంది, జేఎం ఫైనాన్షియల్ ఎండీ

- చివరిసారిగా లోక్‌సభ ఎన్నికలు జరిగిన 2019 ప్రథమార్ధంలో 8 ఐపీవోలే వచ్చాయి. వాటి విలువ రూ.5,509 కోట్లు.
- 2014 జనవరి-జూన్‌లో ఒక్క ఇనీషియల్ పబ్లిక్ ఆఫరే వచ్చింది.
- 2009 తొలి అర్ధ భాగంలో రెండు ఐపీవోలు రాగా, వీటి విలువ రూ.302 కోట్లు.
- భారతీయ స్టాక్ మార్కెట్లలోకి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా వచ్చిన నిధులు రూ.1.85 లక్షల కోట్లపైనే.
- విదేశీ మదుపరులు వెనక్కి తగ్గారేమోగానీ.. దేశీయ మదుపరులు మాత్రం సై.
- ఈ జనవరి-జూన్‌లో వచ్చిన భారీ ఐపీవో భారతీ హెక్సాకామ్. దీని విలువ రూ.4,275 కోట్లు. ఆ తర్వాత ఆధార్ హౌజింగ్ ఫైనాన్స్ (రూ.3,000 కోట్లు).
- ఈ ఏడాది వచ్చిన అతిచిన్న ఐపీవో విభోర్ స్టీల్ ట్యూబ్స్. విలువ రూ.72 కోట్లు.
- నిరుడు ప్రథమార్ధంలో సగటు డీల్ పరిమాణం రూ.896 కోట్లు. ఈసారి రూ.859 కోట్లు.

## హీరో బైకులు ప్రియం

న్యూఢిల్లీ, జూన్ 24: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 1 నుంచి అమలులోకి వచ్చేలా ఎంపిక చేసిన మాడళ్ల ధరలను రూ.1,500 వరకు పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకున్నది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే కొన్ని మాడళ్ల ధరలను పెంచాల్సి వచ్చిందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

## తగ్గిన పసిడి రిజర్వులు

న్యూఢిల్లీ, జూన్ 24: విదేశాల్లో రిజర్వు బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వలు తగ్గుముఖం పట్టాయి. మార్చి 2024 నాటికి గోల్డ్ రిజర్వులు 47 శాతం వరకు తగ్గాయి. 2017 తర్వాత ఇదే కన